# వర్ణం

*Colours of Life*



## కేశవ

# వర్ణం

*The Colours of Life*

ప్రచురణ : 2015

© రచయిత

మూల్యం : 70/-

# రచయిత మాట

నాటి తరం మనిషి మనుగడ బంధాలు, బంధువులు, ప్రేమలు, ఆప్యాయతల మధ్య సాగితే...

నేటి తరం మనిషి మనుగడ డబ్బు, ఈర్ష, ద్వేషాలు, ఒంటరి తనం, ఒకరి మీద ఒకరికి ఓర్వలేని తనం మధ్యలో సాగుతోంది. నాటి తరం ఉమ్మడి కుటుంబాలకి పెద్దపీట వేసి, అందరూ ఒకే ఇంట్లో కలసి మెలసి సుఖసంతోషాలను పంచుకుంటూ జీవించేవారు. జాతికి “కలసి వుంటే కలదు సుఖం” అనే సందేశాన్ని చెప్పేవారు. నేటి తరం ఉమ్మడి కుటుంబాలలో స్వేచ్ఛ లేదు అని చెప్పి వేరే కాపురాలు పెట్టుకుంటున్నారు, వేరే కాపురం పెట్టి నప్పటినుంచి నువ్వు వేరు నేను వేరు అని భార్యభర్తలు విడిపోతున్నారు. వ్యక్తిగత స్వేచ్ఛ, వ్యక్తిగత స్వాతంత్రం సుఖాన్ని ఇవ్వవు, ఒంటరితనాన్ని తప్పు అని ఆలోచించలేక పోతున్నారు. ఒక మనిషి బాగుంటేనే కుటుంబం బాగుంటుంది అని, ఒక కుటుంబం బాగుంటేనే ఊరు బాగుంటుంది అని, ఒక ఊరు బాగుంటేనే సమాజం బాగుంటుందని, ఒక సమాజం బాగుంటేనే ప్రపంచం బాగుంటుందిఅని ఎందరో పెద్దలు చెప్పిన మాటల అర్థం తెలుసుకోలేక పోతున్నారు.

జగమంతా ఒక వసుదైక కుటుంబం అవ్వాలని, చిన్న చిన్న సమస్యలకి కొట్టుకొని బంధాలని, బాధ్యతలని వదిలేయకూడదని చెప్పటానికే ఈ “వర్ణం” కథ యొక్క ముఖ్య ఉద్దేశం,

నా ఈ మొదటి ప్రయత్నం అందరికి నచ్చుతుంది అని, అందరూ ఆశీర్వదిస్తారు అని నమ్ముతూ.........



మీ

**కేశవ**

ఒక సంధ్యా సమయమున ఆకాశం అంతా ఎర్రగా ఉన్న వేళ ఒక టీ దుకాణంలో వున్న రేడియోలో నుండి పాటలు వినిపిస్తున్నాయి. “అందాల బొమ్మ రావేమే – పందిట్లో పెళ్ళి జరిగేనే” అని. అదే సమయంలో ప్రక్కనే ఉన్న సందు మొదట్లోంచి ఒక అమ్మాయి గుడికి వెళ్ళి తిరిగి ఇంటికి వస్తోంది. ఆ అమ్మాయి అందరి కవులు వర్ణించినట్లుగా అందమైన శరీర సౌందర్యంతో, జాలువారే–కళ్ళతో, పొడవాటి జడతో ఏమీ లేదు. చాలా సాదాసీదాగా ఒక మధ్యతరగతి కుటుంబం లో అమ్మాయిలా చాలా సన్నగా, పెద్ద కళ్ళతో, పెద్ద ఒత్తు అయిన జడతో, ఛామన ఛాయ రంగులో ఉంది. ఆ అమ్మాయి పేరు “వర్ణ”. చాలా గాబరాగా ఇంటికి తిరిగి వచ్చింది. అంతలో వాళ్ళ అమ్మ “మహాలక్ష్మి” వర్ణతో...

“ఎక్కడికి వెళ్ళావే గుడికి వెళ్ళావా లేదా మీ ఫ్రెండ్స్‌తో మాట్లాడుకుంటూ ఎక్కడైనా కూర్చున్నావా?

“అదేమీ లేదు అమ్మ – గుడిలో అర్చన కాస్త లేటయ్యింది అంతే... అవునమ్మా ఇంట్లో ఏమిటి హడావిడి నన్ను ఎందుకు ఉదయాన్నే గుడికి వెళ్ళి రమ్మన్నావు?”

అది విని మహాలక్ష్మి చిన్నగా నవ్వుతూ...

“ఈ రోజు నీకు పెళ్ళిచూపులు”

ఈ మాట వినగానే వర్ణకి సిగ్గుతో కూడిన భయం ఏర్పడింది. కానీ అది కప్పిపుచ్చడానికి గట్టిగా అరుస్తూ “అసలు ఎవరిని అడిగి ఏర్పాటు చేశారు ఈ పెళ్ళిచూపులు అయినా ఇలా పెళ్ళిచూపులు పేరు చెప్పి ఎందుకిలా చంపుతున్నారు నన్ను.” అంటూ గది లోపలికి వెళ్లి తలుపు వేసుకుంది.

అప్పుడు వర్ణ అక్క "వరలక్ష్మి"

"వర్ణా! తలుపు తియ్యి" అంటూ తలుపులు కొట్టింది అయినా వర్ణ తలుపులు తీయలేదు. దానితో వరలక్ష్మి గది బయట నుంచే "

"ఎందుకే నీకు అంత కోపం. అసలు ఎవరి మీద నీకు కోపం. ఆలస్యం చేయకుండా పెళ్ళిచూపులకు త్వరగా తయారవ్వు".

వెంటనే వర్ణ గది లోపల నుండే ఆవేశంతో..

"అయినా నీకు ఎందుకే నా పెళ్ళి అంటే అంత ఇన్‌ట్రెస్ట్. నీకు ఎప్పుడో పెళ్ళి అయిపోయిందిగా ఇద్దరు పిల్లలని కూడా కన్నావుగా. ఇంకెందుకు నీకు నా పెళ్ళి చూపుల గురించి, వెళ్ళి నీ పిల్లల విషయం చూసుకో".

ఈ మాటలు విన్న వరలక్ష్మి కోపంగా వాళ్ళ అమ్మ దగ్గరకు వెళ్ళి

"చూశావా! చూశావా! నీ చిన్నకూతురు ఎన్నేసి మాటలు అంటోందో. ఎందుకు అమ్మా! నాకు అంత చిన్న వయసులో పెళ్ళి చేసి నా గొంతు కోశారు. నువ్వు ఆ పని చేసిఉండకపోతే ఇప్పుడు దీని చేత ఇలా మాటలు పడాల్సి వచ్చేది కాదు కదా అమ్మా!" అని ఏడుస్తూ తన పిల్లలను తీసుకొని ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోయింది. ఇదంతా చూసి మహాలక్ష్మి

"అయినా దీనికి ఇదంతా మామూలేగా! ఏదో ఒక విషయానికి ఏడుస్తూ వెళ్ళడం మళ్ళీ ఏదో ఒక విషయానికి ఏడుస్తూ రావడం. అనవసరంగా తొందరపడి ఊరులో సంబంధం కలుపుకున్నాము. వేరే ఊరు సంబంధం దీనికి చేసినా బావుండేది". అని మనసులో అనుకుంటూ వర్ణ గది దగ్గరకు వచ్చి

"వర్ణా! రామ్మా పెళ్ళివారు వచ్చే టైమ్ అవుతోంది. తయారవ్వాలి కదమ్మా" అని తలుపు తట్టింది.

వర్ణ ఏడుపు స్వరంతో "నేనురాను".

ఇంతలో వర్ణ తమ్ముడు "మూర్తి" కిటికీ తలుపులోంచి చూస్తూ

"అక్కా! నువ్వు ఏడ్చినంత మాత్రాన పెళ్ళిచూపులు ఆగవే. వెళ్లి నువ్వు తయారవ్వు" అంటూ ఏడిపించాడు.

ఈ మాటలు విన్న వర్ణ తన ప్రక్కనే ఉన్న పౌడర్ డబ్బాని కిటికీలో నుండి చూస్తున్న మూర్తి మీదకి విసిరేసింది. వెంటనే మూర్తి కిటికీ తలుపులు మూసేసి వెళ్ళిపోయాడు. అదే సమయానికి ఇంటికి పెద్దఅయిన సత్యమూర్తి వచ్చి మహాలక్ష్మితో పెళ్ళి చూపులు ఏర్పాట్లు గురించి తెలుసుకుంటున్నాడు.

"ఏర్పాట్లు అన్నీ అయిపోయాయి కానీ వర్ణ మాత్రం తయారవ్వలేదండి." అని సనిగింది.

సత్యమూర్తి కొంచెం ఆలోచిస్తూ

"ఎందుకు"

"ఏమో! పెళ్ళి చూపులు ఇష్టం లేదనుకుంటండి".

ఈ మాటలు విన్న సత్యమూర్తి వర్ణ గది దగ్గరకు వెళ్ళి

"వర్ణా! వర్ణా!" అంటూ తలుపు తట్టాడు.

తండ్రి గొంతు విన్న వర్ణ. ఆయన మాటకు ఎదురు చెప్పలేక

"నాన్నా! నేను తయారవుతున్నాను.ఐదంటే ఐదే నిమిషాలు" అంటూ కళ్ళు తుడుచుకుంటూ పెళ్ళి చూపులకి తయారుఅవ్వడం మొదలుపెట్టింది.

మొత్తం ఇల్లు అంతా సందడిగా ఉంది. సత్యమూర్తి చుట్టాలు, ఇంటి ప్రక్కన వాళ్ళు అందరూ వచ్చారు. వంటగదిలో మహాలక్ష్మి మగపెళ్ళి వారి కోసం కాఫీలు, టిఫిన్‌లు ఏర్పాటు చేస్తోంది. మగపెళ్ళివారు వచ్చే టైమ్ అవుతుందనడంతో సత్యమూర్తి హడావిడిగా గుమ్మం దగ్గరకు వచ్చి ఎదురు చూస్తున్నాడు. ఇంతలో సంధు చివరిలో ఒక రిక్షా కనిపించింది. అందరూ ఆడవాళ్ళే ఉన్నట్లుగా అనిపించింది. ఈ లోపే రిక్షా సత్యమూర్తి ఇంటి దగ్గరకు వచ్చి ఆగింది. రిక్షాలో నుండి ఒక ముసలి ఆవిడ సత్యమూర్తిని

"బాబూ! ఇక్కడ సత్యమూర్తి ఎవరో తెలుసా! అతని ఇల్లు ఎక్కడో తెలుసా బాబూ"

ముసలి ఆవిడ మాటలు విన్న సత్యమూర్తి చిన్నగా నవ్వుతూ

"నేనే సత్యమూర్తిని మీరు ఎవరండి"

"అలాగా బాబూ! చాలా సంతోషం. మేము పెళ్ళి చూపుల కోసం మీ ఇల్లు వెతుక్కుంటున్నాము. నాపేరు విమల ఈమె నా కూతురు సరస్వతి"

అని అంటూ ఉండగా వెంటనే సత్యమూర్తి

"రండి! రండి! మేము మీ కోసమే ఎదురు చూస్తున్నాము" అంటూ లోపలికి తీసుకువెళ్ళాడు విమల మరియు సరస్వతి కుర్చిలో కూర్చొని మహాలక్ష్మి ఇచ్చిన కాఫీని త్రాగి కాస్త కుదుటపడ్డారు. ఇంతలో సత్యమూర్తి విమలతో

"మీ అబ్బాయి రాలేదా అండి",

"లేదు! రాలేదండి వాడికి ఈ రోజు ఆఫీసులో ఏదో పని ఉందంట" అని అంటూ ఉండగా ఆ మాట ఇంకా పూర్తి కాకుండానే సరస్వతి

"మా అన్నయ్య హైదరాబాద్ "ఏపిఎస్ఆర్‌టిసి"లో సీనియర్ క్లర్క్ కదా! రోజూ చాలా బిజీగా ఉంటాడు అందుకని రాలేదు" అని అంది.

సత్యమూర్తి మరలా విమలవైపు తిరగి

"పోనీలెండి! మీ ఆయన గారైనా వస్తారా".

"అయ్యో! అదేమిటి అన్నయ్యగారు. ఆయన ఖచ్చితంగా వస్తారు. కోర్టులో ఏదో వాయిదా వుందట అది పూర్తి చేసుకొని సరాసరి ఇక్కడికే వస్తానన్నారు".

ఆ మాటలను విన్న సత్యమూర్తి కొంచెం కుదుటపడి తన రెండవ కొడుకు అయిన మూర్తిని సంధు చివర నిలబడి వియ్యంకుడు కనిపిస్తే ఇంటికి దగ్గరుండి

తీసుకు రమ్మన్నాడు. మూర్తి తండ్రి మాటలను విని వెళ్ళి సందు చివరన స్నేహితునితో కలిసి నిలబడి ఎదురుచూస్తున్నాడు. ఇంతలో మూర్తి స్నేహితుడు గోపి, మూర్తితో "ఒరేయ్ మనం మీ కాబోయే మావయ్యని ఎలా కనుక్కుంటాం"

మూర్తి చమత్కారంగా

"ఏముంది ఎవరైతే నల్లకోటు వేసుకొని మన సంధు వైపుకు వస్తాడో వాడే కాబోయే మావయ్య"

ఈ లోపు ఇంట్లో సరస్వతి వెటకారంగా

"మీ అమ్మాయిని ఇంక చూపించరా! ఏంటి?"

అప్పుడు మహాలక్ష్మి లోపల చికాకుగా అనుకున్నాపైకి మాత్రం తప్పక సన్నగా నవ్వుతూ

"అమ్మాయి నెమ్మదిగా రెడీ అవుతోంది వస్తుందండి."

అప్పుడు సత్యమూర్తి వెంటనే

"అమ్మాయి వచ్చే లోపు మా కుటుంబాన్ని పరిచయం చేస్తాను మీకు" అని అంటూ

మొదట తన భార్య వైపు తిరిగి

"అక్కయ్య గారూ! ఈమె నా భార్య మహాలక్ష్మి"

మహాలక్ష్మి చిరునవ్వుతో నమస్కారం పెట్టింది.

"అతడు మా పెద్ద అబ్బాయి "శివరావు" భోపాల్ లో ఎమ్.ఏ చదువుతున్నాడు"

వెంటనే విమల ఆశ్చర్యంగా

"అదేమిటి? అంత దూరంలో ఎందుకు చదువుతున్నాడు. అంటూ ఆరాతీసింది.

ఈ సంభాషణలను గదిలోంచి వింటున్న వర్ణ

"అయినా ఈవిడకు ఎందుకు ఎవరు ఎక్కడ చదువుకుంటే. ఈమె ఏమైనా చదివిస్తోందా ఏంటి." అని చిటపటలాడింది.

"మా అబ్బాయికి అక్కడ యూనివర్సిటీలో సీటు వచ్చింది అక్కడికి వెళ్ళి చదువుకుంటానంటే సరేనని పంపించామండి"

సత్యమూర్తి మాటలు విన్న సరస్వతి

"ఓహో! అయితే మీ అబ్బాయి యూనివర్సిటీలో ఎమ్.ఏ చదువుతున్నాడన్న మాటా...!! అంటూ వ్యంగ్యంగా దీర్ఘాలు తీసింది.

"నాకు ఇంకొక కూతురు ఉందండి. తనకి పెళ్ళి అయింది. పేరు వరలక్ష్మి. తనది ఈ ఊరే. ఇప్పటి దాకా ఇక్కడే ఉండాలి." "ఏమే మహాలక్ష్మి! ఏది మన పెద్ద కూతురు".

అప్పుడు మహాలక్ష్మి కంగారుగా

"ఏదో పని మీద ఇప్పుడే బయటకు వెళ్ళిందండి. వచ్చేస్తూ ఉంటుంది".

"అలాగా"

మరలా సత్యమూర్తి విమల వైపు తిరిగి

"సరే! ఇక మా చిన్న కొడుకు మూర్తి మీరు చూసే ఉంటారుగా! ఇంటర్ చదువుతున్నాడు".

అందరి గురించి విన్న విమల

"బావుందండి మీ కుటుంబం ఇద్దరు అమ్మాయిలు ఇద్దరు అబ్బాయిలు అన్నమాట". మీ పెద్ద అమ్మాయికి ఎంత మంది పిల్లలు" అంటూ మహాలక్ష్మి వైపు తిరిగింది.

"ఇద్దరు అబ్బాయిలండి".

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Varnam**

* * *